సాక్షి
వికారాబాద్

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



పడకేసిన ప్రత్యేక పాలన!

ప్రజాప్రతినిధుల పదవీ కాలం ముగియడంతో గ్రామ పంచాయతీల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. 16లో ▸



అన్నంపెట్టే చెరువుకు కన్నం!

అభివృద్ధి పేరుతో అన్నం పెట్టే చెరువుకు కన్నం పెట్టారు. కాల్వలు, కట్ట ధ్వంసం చేసి బీటీ రోడ్డు వేస్తున్నారు. 16లో ▸



పేరుకు పల్లె.. లబ్ధిలో భలే

బొంరాస్‌పేట మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో వివిధ అభివృద్ధి పరుగులు చురుగ్గా సాగుతున్నాయి. 17లో ▸

న్యూస్‌రీల్

మద్దతు ధర కోసం అన్నదాతల ఆందోళన



ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో నిరసన తెలుపుతున్న రైతులు

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో శనివారం బీట్లు జరుగుతున్న సమయంలో వేరుశెగన రైతులు ఆందోళనకు దిగారు. గత వారం క్వింటాలు వేరుశెగనకు అతి తక్కువ ధర రూ.4,600, రూ.5,787 పలికింది. ధర గిట్టుబాటు కాకపోవడంతో రైతులు విక్రయించలేరు. విషయం తెలుసుకున్న జిల్లా మార్కెట్ కమిటీ డీఎం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎంసీ కార్యదర్శి సిద్దమ్మ ఆన్‌లైన్‌లో ఏ ధర పలికిందో తెలుసుకొని ఆ మేరకు కొనుగోలు చేయాలని వ్యాపారులకు సూచించారు. దీంతో వ్యాపారులు దిగివచ్చి క్వింటాలు తక్కువగా రూ.5,050, మధ్యస్తంగా రూ.5,700, ఎక్కువగా రూ.6,200 ధర ప్రకటించడంతో రైతులు విక్రయించారు.

‘పది’లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

మోడల్ స్కూల్స్, జూనియర్ కళాశాల రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్ చారి



గొట్లపల్లి మోడల్ స్కూల్‌లో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్ చారి

తాండూరు రూరల్: మోడల్ స్కూల్స్‌లో పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్ చారి సూచించారు. శనివారం తాండూరు మండలం జినుగుర్తి, పెద్దేముల్ మండలం గొట్లపల్లి, బషీరాబాద్ మండలంలోని మోడల్ స్కూళ్లను తనిఖీ చేశారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. కొంత మంది విద్యార్థులతో చదివించారు. అనతరం ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సారి మెరుగైన ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆ తర్వాత సౌకర్యాలపై ఆరా తీశారు. గోట్లపల్లి మోడల్ స్కూల్‌లో కళాశాలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించాలని ప్రిన్సిపాల్ గాయత్రిని ఆదేశించారు. కార్యక్రమంలో డీడీఓలు దుర్గాప్రసాద్, రవికుమార్, ఏఎంఓ మంజరి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

5న కౌన్సెలింగ్

అనంతగిరి: జిల్లాలో ఖాళీగా ఉన్న 14 ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు రెండో విడతాను జిల్లా అధికారిక వెబ్‌సైట్ వికారాబాద్.తెలంగాణ. జీఓవీ.ఇన్‌లో పొందుపరిచినట్లు డీఎంహెచ్‌ఓ వెంకటరవణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికై న 14మంది అభ్యర్థులకు 5వ తేదీ ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు.

విద్యకు 15శాతం నిధులు కేటాయించాలి



అనంతగిరి: భవిష్యత్‌లో ప్రవేశ పెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు కనీసం 15శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య జిల్లా ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వికారాబాద్ పర్యటనలో ఉన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని కోరారు. కేజీబీవీల్లో అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. బాలకార్మికుల వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. ప్రైవేట్ విద్యను నియంత్రిస్తూ ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేయాలని కోరారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతగిరి: దివ్యాంగుల ఉపాధి, పునరావాస పథకం కింద బ్యాంకు లింకేజీ లేకుండా నేరుగా రూ.50వేల సబ్సిడీతో కూడిన రుణాల దరఖాస్తు గడువును ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని డీడబ్ల్యూఓ, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు 24 యూనిట్లు కేటాయించారన్నారు.



నిరాశే..!

కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయి

- ప్రత్యేక కేటాయింపులు నిల్
- ఎంఎంటీఎస్ ప్రస్తావన లేదు
- ఊసేలేని వికారాబాద్ – కృష్ణా రైల్వే లైన్
- కానరాని పర్యాటక అభివృద్ధి
- పరిగణలోకి తీసుకోని బుల్లెట్ ట్రైన్

వికారాబాద్: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ శనివారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన 2025 – 26 ఆర్థిక బడ్జెట్‌లో జిల్లాకు మరోసారి మొండిచేయి చూపించారు. మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేద మధ్య తరగతి ప్రజలకు నేరుగా ఒరగబెట్టే పథకాలేవీ పెద్దగా కనిపించలేదు. గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యం, విద్య, మౌలిక వసతులకు పెద్దపీట వేశారు. ఆదాయ పన్ను పరిమితి పెంచడంతో మధ్య తరగతి వేతన జీవులకు కాస్త ఉపశమనం లభించింది. వ్యవసాయంలో స్టార్టప్‌లకు నిధుల కేటాయింపు, కిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితి పెంపు తదితర సానుకూల అంశాలు.. వ్యవసాయ ఆధారిత మన జిల్లాకు లబ్ధి చేకూరనుంది. ఉద్యానవన పంటల ప్రోత్సాహానికి భారీగా నిధులు కేటాయించడంతో మన జిల్లాకు మేలు జరగనుంది. అయితే జిల్లాకు సంబంధించిన ప్రాజెక్టులకు ఆశించిన నిధుల కేటాయింపులు జరగకపోవడం నిరాశకు గురిచేసింది.

పరోక్ష లబ్ధి మినహా..

కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు పరోక్ష లబ్ధి మినహా ప్రత్యక్షంగా ఎలాంటి ప్రయోజనం చేకూరే కేటాయింపులు జరగలేదు. వికారాబాద్ – కష్ణా రైల్వే లైన్‌కు కేటాయింపులు ఉంటాయని భావించిన జిల్లా ప్రజలకు నిరాశే మిగిలింది. రైల్వే లైన్ ప్రస్తావనే లేకపోవడంతో ఆశ్చర్య కలిగిందనే చెప్పాలి. అదే విధంగా జిల్లాలో ఎంఎంటీఎస్ రైల్వే లైన్ పొడిగింపు ప్రస్తావన కూడా లేదు. ఉద్యోగులు, విద్యార్థులు అధికంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా లింగంపల్లి నుంచి వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్ రైలును పొడిగిస్తారని ఆశించారు. కానీ కేటాయింపులు జరగలేదు. మూడేళ్ల క్రితం జిల్లా మీదుగా బుల్లెట్ ట్రైన్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు ప్రజాభిప్రాయ సేకరణ చేయగా దాని ఊసూ లేదు. వికారాబాద్‌లో పలు చోట్ల అండర్ పాస్‌లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. వాటికీ మోక్షం లభించలేదు. నావన్ని రైల్వే స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైల్లు ఆపటంతో పాటు పల్నాడు ఎక్స్‌ప్రెస్ తాండూరు వరకు పొడిగించటం, తాండూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి తదితర అంశాలకు సంబంధించి గతంలో మన ఎంపీలు ప్రతిపాదించగా అవేవీ బడ్జెల్ కనిపించలేదు. ఇటీవలి వరకు పర్యాటక శాఖ మంత్రి మన రాష్ట్రానికి చెందినవారే ఉన్నప్పటికీ అనంతగిరి అభివృద్ధికి నిధుల కేటాయింపు జరగలేదు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా ఫలితం కనిపించలేదు.

సానుకూలాంశాలు

ఒకటవ తరగతి నుంచి ఉన్నత పాఠశాల వరకు డిజిటల్ విద్యాబోధనను చేస్తామని ప్రకటించడంతో జిల్లాలోని 1,063 పైగా పాఠశాలల్లోని విద్యార్థులకు మేలు చేకూరనుంది. ఆదాయ పన్ను పరిమితి రూ.7 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచడం జిల్లాలో ఈ పరిధిలోకి వచ్చే సుమారు నాలుగు నుంచి ఐదు వేల మంది ఉద్యోగులు ఇతర వర్గాల వారికి పన్ను నుంచి విముక్తి లభించనుంది. కిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచిన నేపథ్యంలో జిల్లా రైతులకు లబ్ధి చేకూరనుంది. జిల్లా ఆస్పత్రుల్లో డేకేర్ క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన నేపథ్యంలో మన జిల్లా ఆస్పత్రిలో కూడా ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమల రుణ పరిమితి రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు పెంచారు. దీంతో జిల్లాలో ఈ తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఊతమివ్వనుంది. పాడి, మత్స్యకార రైతులకు ఇచ్చే రుణాల వడ్డీ రాయితీ సులభతరం చేసిన నేపథ్యంలో జిల్లాలోని ఈ వర్గాల వారికి లబ్ధి చేకూరనుంది.

అన్ని వర్గాలకు న్యాయం



కేంద్ర బడ్జెట్‌లో రైతాంగానికి కేటాయింపులు ఊరట కలిగించే అంశం. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్న నిర్ణయం సంతోషకరం. మహిళలకు చేయూతనిచ్చేందుకు ప్రత్యేక నిధులు కేటాయింపు మంచి నిర్ణయం. ఈ బడ్జెట్ అన్ని వర్గాలకు న్యాయం చేసేలా ఉంది.

– మాధవరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

జిల్లాకు ఒరిగిందేమీలేదు



కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు ఒరిగిందేమీలేదు. ప్రజా రవాణాపై వివక్ష చూపారు.లింగంపల్లి – వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్ రైలు, వికారాబాద్ – మక్తల్ కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు కేటాయింపులు లేవు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల పట్ల వివక్ష చూపుతోంది.

– మెతుకు ఆనంద్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

అంకెలగారడీ



ప్రస్తుత బడ్జెట్‌లో రాష్ట్రానికి మేలు జరిగే అంశాలేవీ లేవు. పేదలను కొట్టి పెద్దలకు పెట్టేలా ఉంది. విభజన చట్టంలో పొందుపర్చిన వాటి గురించి ప్రస్తావనే లేదు. జిల్లాకు ప్రయోజనం చేకూర్చే అంశాలు ఒక్కటీ లేవు. పక్షపాత ధోరణికి ఈ బడ్జెట్టే నిదర్శనం.

– టీ.రామ్మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు



రైతులకు పరిహారం చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

రైతుల త్యాగం వెలకట్టలేనిది

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- రైతులకు పరిహారం చెక్కుల పంపిణీ

దుద్యాల్: కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధికి సహకరిస్తున్న రైతుల త్యాగం వెలకట్టలేదని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. దుద్యాల్ మండలంలో పారిశ్రామికవాడ ఏర్పాటులో భాగంగా భూములు కోల్పోతున్న పోలేపల్లికి చెందిన 38 మంది రైతులకు శనివారం పరిహారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన ఈ మండలంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు, కూలీలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రాజెక్టు పూర్తయితే అక్కడి ప్రజలకు ఉపాధి లభిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సంకల్పించారని, ఇందుకు రైతుల సహకారం లభించడం సంతోషంగా ఉందన్నారు. పోలేపల్లికి చెందిన 38 మంది రైతులకు ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం అందజేసి సన్మానించారు. గ్రామంలోని 72 ఎకరాలకు రూ.14 కోట్ల 40 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, దుద్యాల్ తహసీల్దార్ కిషన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతాం

వికారాబాద్‌లోని జిల్లా గ్రంథాలయాన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శనివారం జిల్లా గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. వారికి కావాల్సిన పుస్తకాల గురుంచి అడిగి తెలుసుకున్నారు. యువత అభ్యర్థన మేరకు రెండు కంప్యూటర్లు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. సదుపాయాల కల్పన కోసం కృషి చేస్తానని తెలిపారు. గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఉపయోగపడే విధంగా సమాచార చిత్రపటాలను గోడలపై కనిపించేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శి సురేష్ బాబుకు సూచించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి ఉన్నారు.

బాలకార్మికులకు విముక్తి



ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: జిల్లాలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ద్వారా 151 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించడం జరిగిందని ఎస్పీ నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి జనవరి ఒకటి నుంచి 3వ తేదీ వరకు తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. 151 మంది బాలకార్మికుల్లో 139 మంది బాలలు, 12 మంది బాలికలు ఉన్నారన్నారు. చిన్న పిల్లలను పనిలో పెట్టుకున్న 19 మందిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా పిల్లలను పనిలో పెట్టుకుంటే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయా శాఖల సిబ్బందికి, సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.



ఎస్ఈ కార్యాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

విద్యుత్ సమస్యలు రానివ్వం

- స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: రానున్న వేసవిలో విద్యుత్ సమస్యలు లేకుండా చూస్తామని, నిరంతర సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. శనివారం వికారాబాద్‌లో రూ.3.5 కోట్లతో నిర్మించిన ఎస్ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. నారాయణపూర్‌లో రూ.2.43 కోట్లతో ఏర్పాటు చేయనున్న 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను, జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో రూ.3.13 కోట్లతో ఏర్పాటు చేయనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నారాయణపూర్ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే వ్యవసాయ విద్యుత్‌కు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసే సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే చుట్టు పక్కల గ్రామాలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ (రెవెన్యు)లింగ్యా నాయక్, ఆర్డీఓ వాసుచంద్ర, విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ లీలావతి, డిప్యూటీ ఇంజనీర్లు సంజీవ్, సూర్య, ఏడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తాం

- అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి
- బొంరాస్‌పేటలో అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



బొంరాస్‌పేటలోని అంగన్‌వాడీ నిర్వాహకులకు సూచనలిస్తున్న ఉమాహారతి

బొంరాస్‌పేట: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలు, ప్రస్తుతం ఉన్న సదుపాయాలపై ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక ఇస్తామని అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. చిన్నారులకు పౌష్టికాహారం, ఆటలు ఎంతో ముఖ్యమని అన్నారు. టీఎల్ఎంను ఉపయోగించాలని కార్యకర్తలకు సూచించారు. కేంద్రాల్లోని వసతులపై అంగన్‌వాడీ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూం, రికార్డులను పరిశీలించారు. ఎస్సీ కాలనీలో దెబ్బతిన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి నూతన భవనం, వసతుల కల్పన కోసం ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రం-1కి మరుగుదొడ్ల మంజూరైనా పనులు జరగకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. కేంద్రం – 2కు పక్కా భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తా మన్నారు. కేంద్రం –3లో మరుగుదొడ్లు నిర్మించాల ని కోరారు. చిన్నారులకు విధిగా కోడి గుడ్లు ఇవ్వా లని ఆదేశించారు. కేంద్రాలకు నెలరోజులుగా గుడ్లు రాని విషయం తెలుసుకొని కొడంగల్ సీడీపీఓ రజితకు ఫోన్ చేశారు. వెంటనే గుడ్లు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాంగ్రెస్ పాలనలో కొందరికే సంక్షేమం

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్



పరిగి ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న కేటీఆర్

పరిగి/కుల్కచర్ల: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కొందరికే సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని.. అందరికీ అమలు చేశామని అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు. శనివారం కుల్కచర్ల మండలం దాస్యానాయక్ తండాలో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించి ప్రసంగించారు. బీఆర్‌ఎస్ నాయకులు ఎక్కడికి వెళ్లినా అడ్డుకుంటున్నారని తెలిపారు. ప్రజల తరఫున పోరాటం చేస్తామని ప్రకటించారు. విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని అన్నారు. ప్రతి నెలా మహిళలకు ఇస్తామన్న రూ.2,500 ఏమైందని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం ఇస్తామని మాట తప్పారని తెలిపారు. అబద్దాలతో కాలయాపన చేస్తున్న రేవంత్‌రెడ్డి సర్కారును అడుగడుగునా ప్రశ్నిస్తూనే ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ ఆలీ, సబితారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్‌రెడ్డి, శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్, పట్నం నరేందర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి, బాల్క సుమన్, భుక్య సంజీవ్ నాయక్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, శుభప్రద్ పటేల్, అజయ్ నాయక్, శంకర్‌నాయక్, రాజు, అంగూర్, సుధాకర్ రెడ్డి, రాజు, మేగ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు. లగచర్ల ఘటనలో జైలుకు వెళ్లిన ఏ–2 సురేష్‌ను, గోపాల్ నాయక్‌ను సన్మానించారు. నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే గిరిజనుల భూములను లాక్కునే ప్రయత్నం చేసి వారినే జైలులో వేయడం జరిగిందని.. ఇంతటి నీచమైన సంస్కారం సీఎం రేవంత్‌రెడ్డిదని కేటీఆర్ అన్నారు.

ఘన స్వాగతం

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కుల్కచర్ల మండలం దాస్యనాయక్ తండాలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళ్తున్న క్రమంలో పరిగి పట్టణంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. కేటీఆర్‌ను గజమాలతో సత్కరించారు. ఆయన రాకతో పార్టీకి పూర్వవైభవం ఖాయమని నాయకులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన కేంద్ర బృందం

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని శనివారం జాతీయ వైద్య ఆరోగ్య మిషన్ బృందం సందర్శించింది. డాక్టర్ కవిత, డాక్టర్ శక్తి మాల్వికలతో కూడిన బృందం సభ్యులు ఆస్పత్రిలో జాతీయ క్షయ నిర్మూలన, వ్యాధి నిరోధక టీకాల పంపిణీ, కుటుంబ నియంత్రణ, మలేరియా నివారణ కార్యక్రమాలు ఎలా కొనసాగుతున్నాయో వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు ఆస్పత్రికి ఎంత మంది రోగులు వస్తున్నారు, వారికి ఎలాంటి సదుపాయాలు కల్పిస్తున్నారు తదితర విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రిలో ఫార్మసీ, ల్యాబ్‌లు, ఓపీ సేవలు, డయాలసిస్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి, వైద్యులు మాధవి, విజయ్‌కుమార్, రాఘవేందర్, హర్షిత అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

పౌర సేవలను మెరుగుపరుస్తాం

- ఆస్తి పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్
- తాగునీటి సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి
- అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేకాధికారి సుధీర్



మాట్లాడుతున్న అడిషనర్ కలెక్టర్ సుధీర్

తాండూరు: మున్సిపాలిటీలో పౌరసేవలను మరింత మెరుగు పరుస్తామని అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేకాధికారి సుధీర్ అన్నారు. శనివారం తాండూరు మున్సిపల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ విక్రంసింహారెడ్డితో కలిసి అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. పాలకవర్గం గడువు ముగిసినందున అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మున్సిపల్ కౌన్సిల్ పదవీకాలం ముగియడంతో తనకు ప్రత్యేకాధికారి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల బాధ్యత తనపై ఉందన్నారు. పారిశుద్ధం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఆస్తి పన్నుల వసూలుపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, డీఈఈ మణిపాల్, ఏఈ ఖాజా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, టీఎంసీ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్దేశపూర్వకంగా నిప్పు పెడితే చర్యలు

ఎఫ్ఆర్ఓ రాజేందర్



రాస్నం పరిధిలోని అటవీ ప్రాంతంలో చెలరేగిన మంటలు

యాలాల: అటవీ ప్రాంతంలో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా నిప్పు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రాజేందర్ హెచ్చరించారు. గురువారం అర్ధరాత్రి రాస్నం–అంపల్లి మార్గంలోని అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఫారెస్టు సెక్షన్ అధికారి కనకరాజు సిబ్బందితో వెళ్లి మంటలను ఆర్పేశారు. ఈ సందర్భంగా అటవీ అధికారి మాట్లాడుతూ..అటవీ ప్రాంతంలో మంటలు వ్యాపిస్తే అటవీ భూమిలో సాగు చేసుకుంటున్న రైతులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సుమారు అర ఎకరంలో ముళ్ల పొదలు, ఇతర చిన్నచిన్న చెట్లు కాలిపోయాయని సెక్షన్ అధికారి పేర్కొన్నారు.

పశువైద్యుడిని నియమించండి

జిల్లా అధికారిని కోరిన రైతులు



పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారికి వినతి పత్రం ఇస్తున్న రైతులు

ధారూరు: ధారూరు వెటర్నరీ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ స్వేతను డిప్యూటేషన్‌పై వికారాబాద్ మండలం మద్గుల్ చిట్టెంపల్లి ఆసుపత్రికి పంపించడంతో మూగ జీవాలకు వైద్యం అందకుండా పోయిందని ధారూరు రైతులు శనివారం ఆందోళనకు దిగారు. ఈ మేరకు వారు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి సదానందంను కలిసి వినతిపత్రం సమర్పించారు. రైతు నాయకులు దోర్నాల్ నారాయణ రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ.. డాక్టర్ స్వేత డిప్యూటేషన్‌పై వెళ్లడంతో డాక్టర్ పోస్టు ఖాళీ అయ్యిందన్నారు. వైద్యుడు లేక పశువులకు వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వైద్యుడిని నియమించాలని డిమాండ్ చేశారు. త్వరలో పశువైద్యాధికారిని నియమిస్తామని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి సదానందం రైతులకు హామీ ఇచ్చారు.

బస్సులో ప్రయాణిస్తున్న వృద్ధుడి మృతి

మణికొండ: వ్యక్తిగత పని నిమిత్తం నగరానికి వచ్చిన ఓ వృద్ధుడు గ్రామానికి తిరిగి వెళుతూ ఆర్టీసీ బస్సులో మృతి చెందిన సంఘటన శనివారం నార్సింగిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శంకర్‌పల్లి మండలం, జన్వాడ గ్రామానికి చెందిన బాలరాజు(75) శనివారం మెహిదీపట్నం వెళ్లాడు. మధ్యాహ్నం ఆర్టీసీ బస్సులో ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. బస్సు నార్సింగికి చేరుకోగా గుండెపోటు రావడంతో అతను సీట్‌లోనే కుప్పకూలాడు. దీనిని గుర్తించిన తోటి ప్రయాణికులు కండక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో అతను నార్సింగి పోలీసులకు సమాచారం అందించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

పడకేసిన ప్రత్యేక పాలన!

మెజార్టీ జీపీల్లో నిధుల కొరత

- కన్నెత్తి చూడని స్పెషల్ ఆఫీసర్లు
- అవస్థలు పడుతున్న కార్యదర్శులు

దౌల్తాబాద్: ప్రజాప్రతినిధుల పదవీ కాలం ముగియడంతో గ్రామ పంచాయతీల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. వీటిని ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గత ఏడాది ఫిబ్రవరి 1నుంచి ప్రత్యేక అధికారులను నియమించిన విషయం తెలిసిందే. వీరు పెద్దగా పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో భారమంతా కార్యదర్శుల పైనే పడుతోంది. మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గతేడాది జనవరి 31వరకు పదవుల్లో కొనసాగిన అనేక మంది సర్పంచ్‌లు అప్పు లు చేసి, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ రోజు వరకూ వీరికి సంబంధించిన బిల్లులు రాకపోవడంతో ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని చెబుతున్నారు. ఇదిలా ఉండగా జీపీల బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారులు ఏదైనా కార్యక్రమం ఉంటే తప్ప అటువైపు వెళ్లడం లేదు.

నిధులు లేవు.. పనులు సాగవు

ప్రత్యేకాధికారుల పాలనలో కేంద్రం నుంచి వచ్చే



దౌల్తాబాద్‌లోని ఓ కాలనీలో సీసీ రోడ్డు దుస్థితి

నిధులు రావడం లేదు. దీంతో రాష్ట్రం నుంచి వచ్చే అరకొర గ్రాంట్స్‌తో పాలన కష్టతరంగా మారిందని కార్యదర్శులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కనీసం పంచాయతీ వర్కర్ల వేతనాల చెల్లింపులకు ఇబ్బందిగా మారింది. వీధి దీపాలు, ట్రాక్టర్ డీజిల్ ఇతరత్ర ఖర్చులకు నిధులు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొంతమంది సెక్రటరీలు అప్పులు చేసి మరి పనులు చేయిస్తున్నారు.

అధికారుల సమన్వయ లోపం

ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు గ్రామస్థాయిలో ఉన్న అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. కానీ అనేక గ్రామాల్లో సమన్వయ లోపం కనిపిస్తోంది. స్పెషల్ ఆఫీసర్లుగా ఉన్న మండల స్థాయి అధికారులు అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్న నేపథ్యంలో తామెందుకు ఆరాటపడాలని భావిస్తున్నారు. ఫలితంగా అనేక గ్రామాల్లో పాలన కుంటుపడింది. వీటికి ప్రత్యేకాధికారులు ఎవరనేది కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా స్పెషల్ ఆఫీసర్లు వారికి కేటాయించిన గ్రామాల్లో పర్యటించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గ్రామాలకు వెళ్లాలి

పంచాయతీలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు గ్రామాలకు వెళ్లాలనే ఆదేశాలు ఉన్నాయి. సమస్యలపై కార్యదర్శులతో చర్చించి, పరిష్కారానికి కృషిచేయాలి.

– శ్రీనివాస్, ఎంపీడీఓ, దౌల్తాబాద్



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

మాదిగల ఐక్యతను చాటాలి

షాబాద్: మాదిగల ఐక్యతను చాటి, మహాసభను విజయవతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మద్దిలేటి మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్యాసారం శంకర్‌రావు మాదిగ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ మినీ స్టేడియంలో శనివారం ఎమ్మార్పీఎస్ మహాసభ వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేల గొంతులు, లక్ష డప్పులు మహాప్రదర్శన విజయవంతం చేయడం ద్వారా రాష్ట్రంలో మాదిగల ఐక్యతను చాటాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ చేపట్టిన 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయం దక్కిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 7న ప్రతీ మాదిగబిడ్డ చంకన డప్పుతో నగరానికి రావాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించే లక్ష డప్పులు, వెయ్యి గొంతుకల ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముక్కు విశ్వం మాదిగ, ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు దోస్వాడ నర్సింహులు మాదిగ, జిల్లా నాయకులు జోగు అశోక్‌కుమార్ మాదిగ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్
- యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ ప్రారంభం



విద్యార్థులతో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ శ్రీనివాస్

కొడంగల్ రూరల్: విద్యార్థులు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ (వైఎస్ఎస్ఐ) కార్యక్రమాన్ని కళాశాలలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వై-హబ్ కార్యక్రమాన్ని యూనిసెఫ్, ఇంక్విలాబ్ ఫౌండేషన్, యువత సొసైటీల సౌజన్యంతో నిర్వహిస్తోందన్నారు. తెలంగాణ యువత 21వ శతాబ్దపు నైపుణ్యాలను, విశ్లేషణ శక్తి, సృజనాత్మక, వ్యాపార వృద్ధి ద్వారా విద్యార్థులను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా రూపొందించడమే వైఎస్ఎస్ఐ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. యువతను ఉద్యోగాలు అడిగేవారు కాకుండా ఉద్యోగాలను సృష్టించే స్థాయికి తీసుకెళ్లాలన్నారు. యువతలో అనేక శక్తి సామర్థ్యాలు దాగి ఉన్నాయని, ఓయోను ప్రారంభించిన రితేష్ అగర్వాల్, ఓలాను నెలకొల్పిన భవీష్ అగర్వాల్, స్విగ్గిని నెలకొల్పిన నందన్ రెడ్డి, పేటీఎంను ప్రారంభించిన విజయ్ శేఖర్ వర్మలు యువతేనని వైఎస్ఎస్ఐ కోఆర్డినేటర్ ఆర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ టి.రాంబాబు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ స్థానాల కేటాయింపు



దుద్యాల్ ఎంపీడీవో కార్యాలయం

దుద్యాల్: నూతనంగా ఏర్పడిన దుద్యాల్ మండలానికి 7 ఎంపీటీసీ స్థానాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందుకు సంబంధించిన వివరాలను ఎంపీడీవో కార్యాలయంలో వెల్లడించారు. దుద్యాల్ -1, దుద్యాల్ -2, చిలుముల మూల్వార్, కుదురుమల్ల, హకీంపేట, లగచర్ల, పోలేపల్లి, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేశారు. దుద్యాల్-1 ఎంపీటీసీ స్థానానికి దుద్యాల్ గ్రామం, దుద్యాల్ -2 ఎంపీటీసీ స్థానానికి దుద్యాల్, అల్లిఖాన్‌పల్లి, ఆలేడ్ గ్రామాలు, చిలుముల మూల్వార్ ఎంపీటీసీ స్థానానికి చిలుముల మూల్వార్, చెట్టుపల్లి తండా, నాజుఖాన్‌పల్లి, ఎక్కచెరువు తండా, సత్తర్‌కుంట తండాలు, కుదురుమల్లకు ఎంపీటీసీ స్థానానికి కుదురుమల్ల, సంగాయిపల్లి గ్రామాలు, హకీంపేట్‌కు హకీంపేట్, ఈర్లపల్లి, రోటిబండ తండాలు, లగచర్లకు లగచర్ల, గౌరారం, హంసంపల్లి, సంట్రకుంట తండా, సాగారం తండాలను, పోలేపల్లి ఎంపీటీసీ స్థానానికి పోలేపల్లి గ్రామాలను కేటాయిస్తూ ఫారం-2ను ఎంపీడీవో కార్యాలయం విడుదల చేసింది. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని అధికారులు సూచించారు. తుది జాబితాను ఈ నెల 3న విడుదల చేస్తామని పేర్కొన్నారు.

సంపులో పడి చిన్నారి మృతి

- గౌతాపూర్ శివారు పాలిషింగ్ యూనిట్‌లో ఘటన
- వలస కుటుంబంలో విషాదం
- కేసు నమోదు చేసిన పోలీసులు



పాలిషింగ్ యూనిట్‌లోని నీటి సంపు



మృత దేహంతో ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు



మృతిచెందిన బాలిక

తాండూరు రూరల్: బతుకు దెరువు కోసం వచ్చిన ఓ వలస కుటుంబంలో విషాదం నెలకొంది. అప్పటి వరకు తమ వద్ద ఆడుకున్న చిన్నారి గంటల వ్యవధిలోనే విగతజీవిగా మారింది. ప్రమాదవశాత్తు భవనం పైనుంచి నీటి సంపులో పడి ఊపిరాడక మృతి చెందింది. ఈ హృదయ విషాదకరమైన సంఘటన తాండూరు మండలం గౌతపూర్ సమీపంలోని అజార్ పాలిషింగ్ యూనిట్‌లో శనివారం చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఏఎస్ఐ రాజశేఖర్, మృతురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రం పూర్ణియా జిల్లా బేగంపూర్ ప్రాంతానికి చెందిన మేరాజ్, హసీనా దంపతులు ఆరేళ్ల క్రితం తాండూరుకు వలస వచ్చారు. వివిధ పాలిషింగ్ యూనిట్లో కార్మికులుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి మహీకతన్(4), సిహాబ్ (ఏడాది) ఇద్దరు సంతానం. ప్రస్తుతం వీరు ఆరు నెలలుగా గౌతపూర్ శివారులోని రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న అజార్ పాలిషింగ్ యూనిట్లో పనిచేస్తూ, ఇక్కడే మేడపైన ఓ అద్దె గదిలో ఉంటున్నారు.

ఏం జరిగిందంటే..

రోజు మాదిరిగానే శనివారం ఉదయం మేరాజ్ పాలిషింగ్ యూనిట్ వద్ద పని చేస్తున్నాడు. భార్య హసీనా అతనికి ఫోన్ చేసి పెద్ద పాప మహీ కతన్ కనిపించట్లేదని చెప్పడంతో హుటాహుటిన వచ్చి పరిసరాల్లో వెతికారు. అనుమానం వచ్చి గది వెనకాల ఉన్న నీటి సంపులో పరిశీలించగా పాప కనిపించింది. వెంటనే ఆమెను పట్టణంలోని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. మాతాశిశు ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో అక్కడికి వెళ్లారు. అప్పటికే చిన్నారి మృతిచెందిందని వైద్యులు నిర్ధారించారు.

భవనంపై నుంచి పడి..

మేరాజ్ పనికి వెళ్లగా.. హసీనా వంట చేస్తోంది. వీరి అద్దె గది వెనకాల ఆడుకుంటున్న మహీ కతన్ ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కింద ఉన్న సంపులో పడి, ఊపిరాడక మృతి చెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. పాప మృతితో తల్లి రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. మేరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బాధితుల ఆందోళన

పాలిషింగ్ యూనిట్ యాజమాన్యం తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు శనివారం సాయంత్రం చిన్నారి మృతదేహంతో తాండూరు– చించోళి మార్గంలో గౌతపూర్ వద్ద ధర్నా నిర్వహించారు. దీంతో దిగివచ్చిన యాజమాన్యం మేరాజ్ పనిలో చేరిన సమయంలో అడ్వాన్స్‌గా ఇచ్చిన రూ.35 వేలు మాఫీ చేస్తామని, స్వస్థలానికి వెళ్లేందుకు రవాణా ఖర్చులు అందజేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ముచ్చింతల్ పాఠశాల స్థాయి పెంపునకు ప్రతిపాదన

డీఈవో సుశీందర్‌రావు

శంషాబాద్ రూరల్: మండలంలోని ముచ్చింతల్ ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు సందర్శించారు. పాఠశాల స్థాయి పెంపుపై స్థానికులు కొంతకాలంగా అభ్యర్థిస్తుండగా.. పాఠశాలలో మౌలిక వసతులు, సౌకర్యాల పరిశీలించారు. ఏడాది కిందట కృషి ఫౌండేషన్, మైహోం సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలకు నూతన భవనం ఏర్పాటు చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించారు. పాఠశాల స్థాయి పెంపు కోసం డీఈవో సానుకూలంగా స్పందించడంతో పాటు ఈ విద్యా సంవత్సరం నుంచి 8వ తరగతి బోధన చేపట్టవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా డీఈవోను స్థానికులు, ఉపాధ్యాయులు సన్మానించారు. ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, నోడల్ అధికారి మధుకర్, మాజీ సర్పంచ్ పెంటయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికడదాం



అవగాహన కల్పిస్తున్న హెడ్ కానిస్టేబుల్ అలీమొద్దీన్

మోమిన్‌పేట: మానవ అక్రమ రవాణాను అరికట్టడం అందరి బాధ్యతగా గుర్తించాలని ఏహెచ్‌టీయూ హెడ్ కానిస్టేబుల్ అలీమొద్దీన్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాయమాటలు చెప్పి చిన్న పిల్లల నుంచి పెద్దలను ఎత్తుకెళ్తున్నారన్నారు. ముఖ్యంగా మహిళలు ఎక్కువగా మిస్సింగ్ అవుతున్నారని ఆయన వివరించారు. ముఖ్యంగా అపరిచితులతో ఎక్కువగా సంభాషించొద్దన్నారు. ఫోన్‌ల్లో కూడా మాట్లాడొద్దన్నారు. కొత్తవ్యక్తులు, తెలియని వారితో తగు జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఏదైన అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రన్సిపల్ బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

పది విద్యార్థులకు అల్పాహారం అందజేత

బొంరాస్‌పేట: రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల్లో అందించే స్నాక్స్ శనివారం మండలంలో ప్రారంభించారు. నిత్యం సాయంత్రం 4.15 నుంచి 5.15 వరకు గంటపాటు కొనసాగే స్పెషల్ క్లాస్‌లో విద్యార్థులకు మానసిక ఒత్తిడిని తగ్గించి ఆరోగ్యాన్ని పంచేందుకు ప్రభుత్వం పోషకాలతో కూడిన స్నాక్స్(అల్పాహారం) అందజేస్తోందని చౌదర్‌పల్లి క్లస్టర్ హెచ్ఎం రవీందర్‌గౌడ్ అన్నారు. మండలంలోని రేగడిమైలారం ఉన్నత పాఠశాలలో 18, చౌదర్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 55 పదో తరగతి విద్యార్థులకు ఉడికించిన శనగలు అందజేశారు. రేగడిమైలారం హెచ్ఎం శంకరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రేగడిమైలారంలో విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

పంటలకు త్రుటిలో తప్పిన ముప్పు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని ఎన్కేపల్లి శివారు కొడంగల్ ప్రాంతంలో శనివారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు అగ్గిపుల్ల గిరి పారేసినట్లు తెలిసింది. ఇది గమనించిన ఎన్కేపల్లికి చెందిన బోయిని కృష్ణయ్య, పూజారి నర్సింలు, వడ్ల నర్సింలు, బలిజ వీరేశం, పూజారి సందప్ప అగ్ని మాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. తమ వంతు సహాయక చర్యలు చేశారు. కొద్ది సేపటికి సిబ్బంది వాహనంతో రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో పక్కనే ఉన్న వాము, జొన్న పంటలకు ప్రమాదం తప్పిందని రైతులు ఊపిరి పీల్చుకున్నారు.





కాలిపోతున్న పొలాలు

అన్నంపెట్టే చెరువుకు కన్నం!

చెరువుకట్టను తవ్వి బీటీ రోడ్డు నిర్మాణం

- పాటు కాల్వలు ధ్వంసం చేసి పనులు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లు
- పట్టించుకోని ఇరిగేషన్ శాఖ అధికారులు



చెరువుకట్ట ధ్వంసం చేశారని రైతుల ఆందోళన

బొంరాస్‌పేట: అభివృద్ధి పనుల పేరుతో అన్నం పెట్టే చెరువుకు కన్నం పెట్టారు. సుమారు మూడు తరాల క్రితం నిర్మించిన సాగు నీటి చెరువు కట్ట, పాటు కాల్వలను ధ్వంసం చేసి బీటీ రోడ్డు వేస్తున్నారు. వద్దని ఎంత ప్రాధేయపడినా.. ఇంజనీరింగ్ లెక్కలు ఇలాగే ఉన్నాయంటూ కాంట్రాక్టర్లు, మేస్త్రీలు తమను బెదిరిస్తున్నారని అన్నదాతలు వాపోయారు. ఈ విషయాన్ని ఇరిగేషన్, పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని మండల పరిధిలోని రేగడిమైలారం పటేల్‌చెర్వు ఆయకట్టు రైతులు చెబుతున్నారు.

కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం

మండల పరిధిలోని రేగడిమైలారం పటేల్‌చెరువు కింద సుమారు 50 ఎకరాల ఆయకట్టు ఉంది. ఎస్సీ సామాజికవర్గానికి చెందిన పలు కుటుంబాల వారు ఇందులో ఏడాదికి రెండు పంటలు పండిస్తున్నారు. ఈ చెరువు కట్ట కిందినుంచి మూడుమామిళ్లతండా, డీప్లనాయక్‌తండాకు బీటీ రోడ్డు నిర్మిస్తున్నారు. ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల రోడ్లు కావడంతో కాంట్రాక్టర్లు స్థానిక సమస్యలు పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారు. చెరువు కట్టకింద ఆయకట్టు కాల్వను తవ్వేసి సీసీ రోడ్డు వేశారు. రైతులు వేడుకోగా ఓ కాంట్రాక్టరు మట్టి తీయించారు. పాడైన కాల్వను నిర్మించాలని కోరినా పట్టించుకోలేదు. రోడ్డు విస్తరణ కోసం తాజాగా చెరువుకట్టను తవ్వి నిర్మాణం చేపట్టారు. దీంతో భవిష్యత్తులో చెరువుకట్ట తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఈ విషయమై శనివారం ఎంపీడీఓ వెంకన్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. చెరువునుంచి రెండు ఆయకట్టు కాల్వలకు సీసీతో సీసీ బెడ్ కాల్వలతో నిర్మించాలని కోరారు. పీఆర్ ఏఈ, ఇరిగేషన్ శాఖ అధికారులకు తెలియజేసి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయకట్టు రైతులు బసప్ప, తిర్మలప్ప, వెంకటయ్య, హన్మంతు, ప్రభు, రామప్ప, నర్సప్ప, గోవర్ధన్, బాల్‌రాజ్ ఉన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఆయకట్టు రైతులు